సాక్షి ఒడిశా

గురువారం । 3 । జూలై । 2025



శ్రీ మందిరం ఆదాయం

నగదు : రూ. 2,39,818

వెండి : 50 గ్రాములు - భువనేశ్వర్/పూరీ



మలుపు తిరిగిన రథాలు

మారు రథయాత్రకు సన్నాహాలు ఊపందుకున్నాయి. పూరీలో మూడు రథాలను మలుపుతిప్పి దక్షిణాభిముఖంగా సిద్ధం చేశారు. - 8లో



వైభవంగా గుహారీ సంగీత ఉత్సవం

పూరీ జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని గుహారి జగన్నాథ భక్తి సంగీత ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవం కొనసాగనుంది. - 8లో

న్యూస్‌రీల్

పూరీ తొక్కిసలాట మృతులకు పరిహారం



బాధిత కుటుంబీకులకు ఆర్థిక సాయం అందజేసిన ఉప ముఖ్యమంత్రి

భువనేశ్వర్: పూరీ రథయాత్రలో శారదా బాలి ప్రాంగణంలో జరిగిన తొక్కిసలాటలో మృతులకు ప్రకటించిన పరిహారం రాష్ట్ర మంత్రులు ప్రత్యక్షంగా అందజేస్తున్నారు. ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడా బుధవారం బలిపట్న మండలం ఒతాంతొరొ గ్రామానికి చెందిన పార్వతి దాస్ కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కటుంబీకుల్ని ఓదార్చారు. ముఖ్యమంత్రి ప్రకటించిన రూ. 25 లక్షల ఆర్థిక పరిహారం కుటుంబీకులకు అందజేశారు. విషాదం పట్ల విచారం వ్యక్తం చేశారు.

ఆటోపై విరిగి పడిన చెట్టు



ఆటోపై పడిన చెట్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి రామగిరి సంతలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, గాలులు కారణంగా చెట్లు విరిగి అక్కడ ఉన్న ఆటోపై పడింది. మంగళవారం రామగిరి వారపు సంతకు పలువురు వ్యాపారులు, ప్రజలు వచ్చారు. కొంతమంది ఆటోలో తిరిగి తమ గ్రామాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఒక మామిడి చెట్టు గాలికి అకస్మాత్తుగా విరిగి ఒక ఆటోపై పడింది. ఆ సమయంలో అందులో ఎవరూలేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రహదారిపై ఆ చెట్టు పడటం వలన దండాబెడ నుంచి బొయిపరిగులకు వాహనాల రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి చెట్టును తొలగించి రోడ్డు క్లియర్ చేశారు.

తొక్కిసలాట దర్యాప్తు వేగవంతం



దర్యాప్తు చేస్తున్న అభివృద్ధి కమిషనర్

భువనేశ్వర్: పూరీ శారదా బాలి ప్రాంగణంలో తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ దర్యాప్తు ప్రారంభించారు. నెల రోజుల్లోగా నివేదిక అందజేసేందుకు కమిషనర్‌తో పాటు నలుగురు ఓఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్, సాధారణ పాలన, ప్రజాభియోగాలు విభాగం అదనపు కార్యదర్శి మానస్ రంజన్ సామల్, గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి బినయ కుమార్ దాష్, జలవనరుల శాఖ అదనపు కార్యదర్శి రష్మి రంజన్ నాయక్, నిర్మాణ శాఖ అదనపు కార్యదర్శి ప్రదీప్ కుమార్ సాహూ ఉన్నారు. బినయ కుమార్ దాష్, రష్మి రంజన్ నాయక్, ప్రదీప్ కుమార్ సాహూ ప్రస్తుతం రథ యాత్ర కార్యకలాపాల పర్యవేక్షణ కోసం పూరీలో సేవలు అందిస్తున్నారు. సంబంధిత అధికారులు వారి సాధారణ, దైనందిన విధులతో పాటు దర్యాప్తు బాధ్యతలను చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిర్వాహకుల నిర్లక్ష్యం.. చెత్త కుప్పల్లో ప్రసాదం



చెత్తకుప్పల్లో మహాప్రభు ప్రసాదం

రాయగడ: రథయాత్రలో భాగంగా ప్రభు జగన్నాథుని కిచుడి భోగం (ప్రసాదం)పొందేందుకు గంటల తరబడి భక్తులు వేచి ఉంటారు. ఈ మహాప్రసాదానికి అంత పవిత్రత ఉంది. ఈ క్రమంలో స్థానిక గుండిచా మందిరంలో నిర్వాహకుల నిర్లక్ష్యం తాజాగా బయటపడింది. జగన్నాథుని మహాప్రసాదాన్ని చెత్తకుప్పల్లో పారబోయడం చర్చనీయాంశంగా మారింది. మహాప్రసాదం కోసం గంటల తరబడి వేచి ఉన్నా లభించక నిరాశతో వెనుతిరిగే భక్తులు ఇలా ప్రసాదాన్ని నిర్వాహకులు నేలపాలు చేస్తుండటంపై మండిపడుతున్నారు. ఒకవేళ మిగిలిపోతే సమీపంలోని నదిలో వేయకుండా చెత్తకుప్పల్లో పారబోయడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రియదర్శని సిబ్బందిపై మండిపడ్డారు.



కొరాపుట్: దమంజోడిలో నాల్కో పరిశ్రమ వద్ద కమ్ముకున్న మేఘాలు

స్తంభించిన జనజీవనం

- వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- అతలాకుతలమైన కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలు



కొరాపుట్: నందాహండిలో కూలిన ఇళ్లు



కొరాపుట్: నందాహండి లో గిరిజనులకు టార్పాలిన్ల పంపిణీ

కొరాపుట్/జయపురం: సుమారు వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కొరాపుట్, నబరంగ్‌పూర్ ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. బుధవారం విజయవాడ–రాంచీ జాతీయ రహదారిపై జయపూర్–మల్కన్‌గిరి మధ్య బోయిపరిగుడ సమితి కేంద్రం సమీపంలో జుబా కెనాడి వద్ద భారీ చెట్లు నేలకూలాయి. దీంతో ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. రాత్రిపూట హైదరాబాద్ నుంచి వచ్చే బస్సుల్లో ప్రయాణికులు చిక్కుకుపోయారు. జయపూర్ నుంచి ఫైర్ ఆఫీసర్ సురేష్ బారిక్ నేతృత్వంలో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మరోవైపు, కొరాపుట్–రాయగడ మార్గంలో బంగ్లాగుడ వద్ద నీరు పోటెత్తింది. దీంతో రాయగడ జిల్లాకు రాకపోకలు నిలిచిపోయాయి. నబరంగ్‌పూర్–ఉమ్మర్‌కోట్ మార్గంలో జతాబల్ వద్ద నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో వాహనాలు మళ్లిస్తున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితిలో గిరిజనుల ఇళ్లు కూలిపోయాయి. బాధితులకు ప్రభుత్వ సిబ్బంది టార్పాలిన్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఇంద్రావతి, శబరి, బస్కల్, టురి, గంతాయిత్, కొలాబ్, దుడుమ నదులకు వరద నీరు పోటెత్తింది. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. రిజర్వాయర్‌లలో కటాఫ్ ప్రాంతాలలో నివాసముంటున్న ప్రజలు పడవ ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. మరోవైపు గ్రామాల్లో జ్వరాలు, అతిసారం ప్రబలడంతో గిరిజనులు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు. ఇదిలా ఉండగా, ప్రభుత్వ కార్యాలయాలలో మూకుమ్మడి సమ్మె కారణంగా సకాలంలో సేవలు అందక ప్రజలు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

ఇంటిపై పడిన చెట్టు

సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి కొలార్ పంచాయతీ హుడిగుడలో ఓ వృద్ధురాలు నివసిస్తున్న ఇక ఇంటిపైచింత చెట్టు విరిగిపడింది. ఈ ఘటనలో గురువారీ నాయిక్ అనే వృద్ధురాలు గాయపడింది. నలుగురు కుమార్తెలతో కలిసి ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రపోతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక విభాగ అధికారి సుకాంత ప్రధాన్ నేతృత్వంలో సిబ్బంది వచ్చి సహాయక చర్యలు చేపట్టారు.

- కొరాపుట్ జిల్లాలో గత నాలుగు దినాలలో ఎడతెరిపి లేకుండా బారీ వర్షాలు పడుతున్నాయి. గత 24 గంటలలో జిల్లాలో 1062.5 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

దశమంత్‌పూర్‌లో కొట్టుకుపోయిన మార్గం

కొరాపుట్: భారీ వర్షాలకు కొరాపుట్ జిల్లా అతలాకుతలమైంది. దశమంత్‌పూర్ సమితికి వెళ్లే మార్గంలో వంతెన వద్ద రోడ్డు వరద నీటిలో కొట్టుకుపోయింది.దీంతో సమితి పరిధిలో 5 పంచాయతీల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కుంద్ర సమితిలో రోగులతో వెళ్తున్న అంబులెన్స్ వర్షాల ధాటిలో బురదలోకి జారిపోయింది. వెంటనే స్పందించి స్థానిక గిరిజనులు ట్రాక్టర్ ద్వారా అంబులెన్స్‌ను బయటకు లాగారు.



కొరాపుట్: జయపూర్ పట్టణంలో ఇలా..



కొరాపుట్: దశమంత్‌పూర్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు



కొరాపుట్‌సిందిగాంలో కూలిన ఇళ్లు ముందు బాధితురాలు



కొరాపుట్: విజయవాడ-రాంచీ జాతీయ రహదారిపై కూలిన చెట్లను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



జయపురం: హుడిగుడలో ఇంటిపై పడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



కొరాపుట్: బొయిపరిగుడ వద్ద నిలిచిన రవాణా సేవలు



కొరాపుట్: కూలిన చెట్లను నరుకుతున్న సిబ్బంది



జయపురం: జయపురం-బొయిపరిగుడ దారిలో రోడ్లపై పారుతున్న వర్షపు నీరు



కొరాపుట్: జేసీబీ పునరుద్ధరణ పనులు



జయపురం: దసమంతపూర్ ప్రాంతంలో ఆంధారి నది వరద నీటిలో ప్రజలు



కొరాపుట్:ధన్‌పూర్‌లో బాదితులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వసిబ్బంది



ఉమ్రిలో కూలిన ఇంటిలో బాధితులు

బురదలో కూరుకుపోయిన అంబులెన్స్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి నాకమామ్ముడి పంచాయతీ హతీహంబ్ గ్రామం నుంచి గంధిగూఢకు వెళ్లే రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తాజాగా గంధిగూఢ గ్రామం నుంచి ఓ రోగిని బుధవారం తరలిస్తున్న అంబులెన్స్ బురదలో కూరుకుపోయింది. దీంతో గంటసేపు రోగి అంబులెన్స్ ఇబ్బందిపడ్డాడు. ఇంతలో ట్రాక్టర్‌కు తాడును కట్టి దాని సహాయంతో అంబులెన్స్‌ను బురదలో నుంచి బయటకు తీశారు. అనంతరం రోగిని కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రభుత్వం స్పందించి తమ గ్రామాలకు పక్కా రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్ సాయంతో అంబులెన్స్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

• ప్రజా సేవలు బంద్



నబరంగ్‌పూర్ కలెక్టర్ శుభంకర్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఓఏఎస్ అధికారులు



జయపూర్‌లో సమావేశమైన రెవెన్యూ ఉద్యోగులు



కొరాపుట్‌లో ఆందోళన చేస్తున్న ఓఏఎస్ అధికారులు

- మున్సిపల్ అధికారిపై బీజేపీ కార్తకర్తల దాడి నేపథ్యంలో మూకుమ్మడి సెలవులో ఉద్యోగులు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో బుధవారం ప్రజా సేవలు స్తంభించాయి. భువనేశ్వర్ మున్సిపల్ కమిషనర్ ఆఫీస్‌లో జాయింట్ కమిషనర్ రత్నాకర్ సాహూపై బీజేపీ కార్యకర్తలు హత్యాయత్నం చేశారు. రత్నకర్ సాహు అత్యధిక కాలం నబరంగ్‌పూర్, కొరాపుట్ జిల్లాలో పని చేసి ఉన్నారు. ఈ నేపథ్యంలో హత్యాయత్నాన్ని నిరసిస్తూ నబరంగ్‌పూర్ జిల్లాలో ఓఏఎస్ అధికారులు మూకుమ్మడి సెలవు పెట్టారు. దాడికి పాల్పడిన వారిపై తక్షణమే చర్య తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రోకి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలకు సేవలు నిలిచిపోయాయి. కొరాపుట్ జిల్లా కేంద్రంలో ఓఏఎస్ అధికారులు భారీ వర్షంలో ర్యాలీ నిర్వహించారు. తమ సహచర ఓఏఎస్ అధికారిపై జరిగిన దాడిని ఖండించారు. భద్రత లేకుండా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లలేమని నినాదాలు చేశారు. ఉద్యోగులు విధుల్లో లేకపోవడంతో జిల్లాస్థాయి ముఖ్య కార్యాలయాలు వెలవెలబోయాయి. జయపూర్‌లో రెవెన్యూ ఉద్యోగుల సంఘం అత్యవసర సమావేశం నిర్వహించి దాడులను సహించమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ పార్టీల కార్యకర్తల దాడులను తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర రెవెన్యూ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిరుపతి బాలాజీ సాహు నబరంగ్‌పూర్‌లో మాట్లాడుతూ.. రత్నకర్ సాహుకి తాము అండగా ఉన్నామని ప్రకటించారు.

లైంగిక దాడి కేసులో ఒకరి అరెస్టు



అరెస్టయిన దేవ్

జయపురం: జయపురంలో ఉంటున్న హర్యానకు చెందిన మహిళపై జరిగిన లైంగిక దాడిలో కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు మహిళా పోలీసు అధికారి ఆశ్రిత ఖాల్‌కో బుధవారం వెల్లడించారు. అరెస్టయిన వ్యక్తి స్థానిక మహాత్మా గాంధీ రోడ్డు గాంధీచౌక్ పరిధికి చెందిన దేవ్ సోనిగా తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచామన్నారు. కోర్టు బెయిల్ నిరాకరించటంతో జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసు అధికారి తెలిపిన వివరాలు ప్రకారం.. జయపురం సమీప బరిణిపుట్‌లోని రాహుల్ గర్గ్ షోరూంలో హర్యానకు చెందిన మహిళ పని చేస్తూ.. పట్టణంలో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. గతనెల 28వ తేదీ రాత్రి సమయంలో జయపురం రథాయాత్ర తిలకించేందుకు ఆమె వెళ్లింది. మార్గమధ్యలో దేవసోని కలిశాడు. అనంతరం వారంతా రథాయాత్ర చూసి అందరూ ఇంటికి వచ్చారు. ఆ మహిళ తన ఇంటిలో దుస్తులు మార్చుకుంటున్న సమయంలో దేవ్ సోని వచ్చి ఆమెపై దాడి చేసి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అరిస్తే చంపుతానని బెదిరించి అక్కడ నుంచి పారిపోయాడు. బాధిత మహిళ జయపురం మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి నిందితుని అరెస్టు చేశామన్నారు. ఈ సంఘటనలో ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసు అధికారి వెల్లడించారు.

• చిత్రకారులకు ఘన సత్కారం



చిత్రకారులను సత్కరిస్తున్న అతిథులు



వేదికపై ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు



అతిథులకు ధారు దేవత చిత్రాలను అందజేస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక విక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలలో రథాయాత్ర సందర్భంగా నిర్వహించిన ధారుదేవత చిత్రాల వర్క్‌షాపుల్లో పాల్గొని జగన్నాథుని వివిధ రూపాలతో విద్యార్థులు వేసిన చిత్రలను సిమ్మాద్రి మహారాణ కళా భవనంలో బుధవారం ప్రదర్శించారు. ఈ చిత్రాలతో పాటు డాక్టర్ పరేష్ రథ్ ప్రదర్శించిన జయపురం చారిత్రిక చిత్రాల ప్రదర్శన కూడా ఈ భవనంలోనే జరుగుతోంది. ఈ ప్రదర్శనలో ధారు దేవతపై 40 చిత్రాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిత్ర కారులైన విద్యార్థులను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బాహిణీపతి ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ ప్రదర్శన ఈ నెల ఐదో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఝుధిష్ఠర్ మల్లిక తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిత్ర కళలో విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ఒడిశాలో ప్రథమ శ్రీవిక్రమ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ కళాశాలను ఇంకా అభివృద్ధి చేయాలని.. అందుకు తాను చేయూతనిస్తానని అన్నారు. కార్యక్రమంలో కొరాపుట్ భారతీయ జాతీయ కళా సాంస్కృతిక చారిత్రిక ట్రస్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రఫుల్ల చంద్ర మహారాణ, కొరాపుట్ కోట్స్ (కౌన్సిల్ ఆఫ్ అనాలిటికల్ ట్రైబుల్ స్టడీస్) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పరేష్ రథ్ పాల్గొన్నారు. అతిథులకు ధారుదేవత చిత్రాలను నిర్వాహకులు అందజేశారు.

కెనాల్‌లో లాంచీ బోల్తా

- ప్రయాణికులను కాపాడిన గిరిజనులు
- వరదనీటిలో కొట్టుకుపోయిన మూడు బైక్‌లు



నదిలో బోల్తా పడ్డ లాంచీ

కొరాపుట్: కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి ద్వరసని గ్రామ పంచాయతీలోని ముండి గుడ కెనాల్ లో బుధవారం సాయంత్రం లాంచీ బోల్తా పడింది. అయితే అందులో ఉన్నవారిని సమీపంలో ఉన్న గిరిజనులు కాపడడంతో పెను ప్రమాదం తప్పింది. లాంచీ బోల్తాపడిన సమయంలో అందులో ఏడుగురు ఉన్నారు. లాంచీ బోల్తాపడడంతో అందులో ఉన్నవారు భయంతో హాహాకారాలు చేయడంతో వారి కేకలువిని సమీపంలో ఉన్న గిరిజనులు రంగం లోనికి దిగారు. తాళ్లు వేసి వారిని రక్షించారు. లాంచీని కూడా అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. అయితే లాంచీలో ఉన్న మూడు బైక్‌లు వరద నీటిలో కొట్టుకు పోయాయి. మురాన్ నది నుంచి ఈ కెనాల్ ద్వారా నీరు ఇంద్రావతి డ్యాంలో కలుస్తుంది. కెనాల్‌కి మరో వైపు నబరంగ్‌పూర్ జిల్లా తెంతుల కుంటి సమితి ఉంది.



లాంచీని ఒడ్డుకు చేరుస్తున్న గిరిజనులు

మలుపు తిరిగిన రథాలు

- మారు రథయాత్రకు సన్నాహాలు
- మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన హీరాపంచమి పూజలు


కదులుతున్న బలభద్ర స్వామి రథం

భువనేశ్వర్: పవిత్ర ఆషాఢ మాసం శుక్ల సప్తమి తిథి పురస్కరించుకుని జగన్నాథుని మారు రథయాత్ర పనులు ప్రారంభించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మూడు రథాలను మలుపుతిప్పి దక్షిణాభిముఖంగా సిద్ధం చేశారు. ఈ సన్నాహాలు మారు రథయాత్రకు తొలి సంకేతం. పవిత్ర హీరాపంచమి రోజున స్వామి దర్శనం కోసం వేంచేసిన శ్రీ మహాలక్ష్మీ దేవి కోరిక తీరకుండా నిరుత్సాహంతో వెనుదిరిగింది. ఆమె విరహ వేదన గుర్తించిన భగవంతుడు తక్షణమే మహాలక్ష్మి చెంతకు చేరాలని ఉపక్రమించాడు. ఈ నేపథ్యంలో హీరా పంచమి మరుసటి రోజు నుంచి జగన్నాథునితో సహా అన్నాచెల్లెళ్లు బలభద్ర స్వామి, సుభద్ర దేవితో చక్రరాజు సుదర్శనుడు శ్రీ మందిరానికి తిరిగి చేరేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి వరకు హీరా పంచమి ఉత్సవ పూజాదులు కొనసాగాయి. ఆచారం ప్రకారం తొలుత దేవీ సుభద్ర రథం దర్పదళనం దక్షిణం వైపు మలుపు తిప్పారు. మూలవిరాటు నుంచి ఆజ్ఞామాలలు చేరడంతో రథాలు మలుపు తిప్పడం ప్రారంభించారు.


పర్లాకిమిడి: వామన, పరశురాం అవతారంలో జగన్నాథ, బలభద్రులు

వామన అవతారంలో జగన్నాథుడు దర్శనం

కొరాపుట్: జగన్నాథ రథాయాత్రలో భాగంగా దేవదేవుడు వామన అవతారంలో బుధవారం రాత్రి దర్శనం ఇచ్చాడు. కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో ఆరో రోజు ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి దర్శనానికి గుండిచా మందిరాల వద్ద భక్తులు భారీ వర్షంలోనూ ఎదురు చూశారు.

వామన, పరశురాం అవతారంలో జగన్నాథ, బలరాములు

పర్లాకిమిడి: గుండిచా మందిరంలో రథాయాత్రకు భారీగా ప్రజలు చుట్టుపక్కల గ్రామాల నుంచిడి తరలివస్తున్నారు. బుధవారం గుండి చామందిరంలో జగన్నాథుడు వామన అవతారంలో, బలభద్రుడు పరశురాం అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. దశవతారాలు చూడటానికి సరిహద్దు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రజలు తరలివచ్చారు.


కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో దేవదేవులు


నబరంగపూర్‌లో వామన అవతారంలో జగన్నాథుడు


రథాన్ని తిప్పుతున్న పోలీసు బలగం


ఆజ్ఞామాలతో రథానికి పూజ


అడపా మండపంపై స్వామి దర్శనానికి చేరుకున్న మహాలక్ష్మి


రథాలు మలుపు తిప్పేందుకు భగవంతుని ఆజ్ఞగా వేసిన పూలమాల


స్వామి దర్శనానికి బయల్దేరిన మహాలక్ష్మి


కొటపాడ్ పట్టణంలో దేవదేవుడు ఇలా..


పర్లాకిమిడి: పరశురాం అవతారంలో బలభద్రుడు


బోయిపరిగుడ సమితి కేంద్రంలో..


జయపూర్‌లో వామన అవతారంలో దర్శనమిచ్చిన జగన్నాథుడు

క్లుప్తంగా

బీజేపీ నేత జగన్నాథ్‌ను అరెస్టు చేయాలి

భువనేశ్వర్: స్థానిక నగర పాలక సంస్థ (బీఎంసీ) అదనపు కమిషనర్ రత్నాకర్ సాహూ విధి నిర్వహణలో ఉండగా అవమానకర దాడిని ప్రేరేపించిన ప్రధాన సూత్రధారి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ కార్యనిర్వాహఖ సభ్యుడు జగన్నాథ్ ప్రధాన్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహూజా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి వినతిపత్రం బుధవారం అందజేశారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి


రోహిత్ (ఫైల్)

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి మాటపాకా ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న రోహిత్ మడ్కమి (12) అనే విద్యార్థి బ్రెయిన్ మలేరియాతో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఇతని స్వగ్రామం శిఖాపల్లి పంచాయతీ ఊరమగుడ. హాస్టల్లో ఉండగా జ్వరం రావడంతో మల్కన్‌గిరి ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ రోహిత్ మృతిచెందాడు. సబ్ కలెక్టర్ దుర్యోధన్ పాత్రో ఈ ఘటనపై ఆరా తీశారు.

ఏసీపీ ప్రకటన రాజ్యాంగ విరుద్ధం


తారాప్రసాద్ బాహిణీపతి

కొరాపుట్: ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తల కాళ్లు విరగ్గొట్టాలని, అలా చేస్తే రివార్డు ఇస్తానని భువనేశ్వర్ ఏసీపీ నర్సింగ బలో వ్యాఖ్యానించడం రాజ్యాంగ విరుద్ధమని జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భువనేశ్వర్‌లో బీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ దాడి చేస్తే ఎక్కడికు వెళ్లారని ప్రశ్నించారు. ఇలా దాడి చేస్తే వారి మీద 307 సెక్షన్ ఎందుకు పెట్టలేదన్నారు.

పూరీ మరణాలు కనిపించవా?


సప్తగిరి ఉల్క

కొరాపుట్: పూరీ మరణాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముగ్గురు భక్తులు మరణించినందున ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. ఇదే గుజరాత్ మోడల్ పాలన అని ఎద్దేవా చేశారు. ఏడాది పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేశారని మండిపడ్డారు.

ఘనంగా వనమహోత్సవం


మొక్కను నాటుతున్న సురేంద్రకుమార్ పాత్రో

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో వన మహోత్సవాలు సందర్భంగా 'తల్లి కోసం ఒక మొక్కను నాటుదాం'అనే నినాదంతో జిల్లా స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నత పాఠశాలల పీఈటీ ఇన్‌చార్జి సురేంద్ర కుమార్‌పాత్రో ముఖ్యఅతిథిగా విచ్చేసి శిశు విద్యామందిర్ ఆవరణలో విద్యార్థులతే మొక్కలను నాటించారు. కార్యక్రమంలో సరస్వతీ శిశు మందిర్ ప్రధాన ఆచార్యులు సరోజ్ కుమార్ పండా, జిల్లా వికాస్ సమితి కార్యకర్త అరుణ్‌కుమార్ భాగ్, కోశాధికారి ప్రమోద్ కుమార్ పాఢి, మనోజ్ కుమార్ దాస్, ప్రకాష్ చంద్ర త్రిపాఠి, సరోజ్ కుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

గొట్టా బ్యారేజీ నీరు విడుదల

హిరమండలం : ఖరీఫ్‌లో శివారు ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి గొట్టా బ్యారేజీ నుంచి ఎడమ ప్రధాన కాలువలోకి నీరు విడుదల చేశారు. అనంతరం గొట్టా బ్యారేజీ నీటి నిల్వ, ఔట్ ఫ్లో, ఇన్ ఫ్లో ప్రవాహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వంశధార అధికారులు మాట్లాడుతూ బ్యారేజీలో ప్రస్తుతం 38.1 మీటర్ల నీటిమట్టం ఉందన్నారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వంశధార ప్రాజెక్టు చైర్మన్, వైస్ చైర్మన్లు ఎ.రవీంద్ర, ఒ.ఆనందరావు, వంశధార ఎస్ఈ స్వర్ణకుమార్, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఈఈలు సీతారాంనాయుడు,శేఖర్ బాబు, డీఈఈలు బి.సరస్వతి, ధనుంజయ రావు, ఏఈ పరిశుద్ధబాబు, సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు పాగిరి బుచ్చిబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు టి.తిరుపతిరావు, నాయకులు పి.శ్రీధర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుహారీ సంగీత ఉత్సవం


జీకేసీఎం ఒడిస్సీ పరిశోధన కేంద్రం విద్యార్థులు బృంద గానం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్ర పురస్కరించుకుని గుహారి జగన్నాథ భక్తి సంగీత ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతి విభాగం ఆధ్వర్యంలో గురు కేలూ చరణ్ మహాపాత్రొ ఒడిస్సీ పరిశోధనా కేంద్రం ఏటా ఈ ఉత్సవం నిర్వహిస్తుంది. స్థానిక జీకేసీఎమ్ ఒడిస్సీ పరిశోధనా కేంద్రం ప్రాంగణం రంగ స్థలం వేదికగా మూడు రోజుల పాటు ఈ ఉత్సవం కొనసాగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని జగన్నాథుని భక్తి సంగీతాన్ని ఆలపిస్తారు. ముందుగా సంస్కృత పండితుడు ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ మిశ్రా జ్యోతి ప్రజ్వలన చేశారు. జీకేసీఎమ్ ఒడిస్సీ పరిశోధన కేంద్రం విద్యార్థులు బృంద గానం చేశారు. తొలి రోజు ఉత్సవంలో ప్రఖ్యాత గాయకులు దుఃఖీ శ్యామ్ త్రిపాఠి, సుస్మితా దాస్, లక్ష్మీకాంత పాలిత్, భాగ్యశ్రీ మహంతి, బిష్ణుమోహన్ కబీ, సంజు మహంతి వీనుల విందైన సంగీతం ఆలపించారు. మనోరంజన్ అధికారి (తబలా), సందీప్ సాహు (డ్రమ్), జబహార్ మిశ్రా (ఫ్లూట్), సముయేల్ ఖుంటియా (ఆక్టోప్యాడ్), సుబ్రత్ రౌత్రాయ్ (కీబోర్డు), అజయ్ కుమార్ దాస్ (హార్మోనియం) వాద్య సహకారం అందజేశారు. డాక్టర్ మృత్యుంజయ రథ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.


భక్తి గీతాలాపన


మనోరంజన్ అధికారి తబలా వాద్యం


వీనుల విందుగా సాగిన వేణు గానం

విద్యుత్ ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేయాలి

భువనేశ్వర్: రాష్ట్రంలో కీలకమైన విద్యుత్ ప్రాజెక్టులు మందకొడిగా సాగుతున్నాయి. ఈ పరిస్థితి పట్ల విద్యుత్‌శాఖ బాధ్యతలు వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ ప్రత్యక్షంగా చొరవ తీసుకున్నారు. ప్రాజెక్టులు నిర్వహిస్తున్న ఒడిశా పవర్ జనరేటింగ్ కార్పొరేషన్ (ఓపీజీసీ), ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్ (ఓహెచ్‌పీసీ) ఉన్నతాధికారులతో సమావేశమై తాజా పురోగతిని సమీక్షించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఈ ప్రాజెక్టుల్ని వేగవంతం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి గల కారణాలు, పరిస్థితులను మంత్రి పరిశీలించి సమర్థవంతమైన పరిష్కారాలను రూపొందించాలని సీనియర్ అధికారులతో చర్చించారు. ఒడిశా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, స్థిరత్వాన్ని పెంచాలన్నారు. ఈ సమావేశంలో ఓపీజీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న 2''660 మెగా వాట్ మూడవ దశ విస్తరణ, 50 మెగా వాట్లు సౌర విద్యుత్ ప్రాజెక్టు, ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) యూనిట్, ఫ్లైయాష్ వినియోగం, ఖాళీ అయిన గనుల నిర్వహణ ప్రాజెక్టుల్ని సమీక్షించారు. ఓహెచ్ పీసీ చొరవతో కొనసాగుతున్న ప్రాజెక్టుల్లో 600 మెగా వాట్ల ఎగువ ఇంద్రావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ (కలహండి), 600 మెగా వాట్ల ఎగువ కోలాబ్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ (కొరాపుట్), 500 మెగా వాట్ల బలిమెల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్ (మల్కన్‌గిరి), 63 మెగా వాట్ల ఖడగ్ హైడ్రో ప్రాజెక్ట్ (కంధమల్) ఉన్నాయి. నాణ్యతా ప్రమాణాలతో ఈ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు నిరంతరం క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.


విద్యుత్ ప్రాజెక్టులపై సమీక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్

ప్రభుత్వ ఆస్పత్రిలో స్వల్ప అగ్ని ప్రమాదం


కాలిపోయిన ఏసీ


ప్రమాదం అనంతరం వార్డును శుభ్రం చేస్తున్న మహిళలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని కంటి విభాగం ఓపీ గదిలో బుధవారం మధ్యాహ్నం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏసీ నుంచి మంటలు చెలరేగాయి. దీన్ని చూసిన సెక్యూరిటీ గార్డులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. అలాగే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భావిస్తున్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలకు రంగం సిద్ధం!

- అత్యవసరంగా సమావేశమైన బీజేపీ కీలక నాయకులు

భువనేశ్వర్: బీఎంసీ అదనపు కమిషనరుపై దాడి చేసిన ప్రధాన సూత్రధారి జగన్నాథ్ ప్రధాన్‌ను అరెస్టు చేయాలనే డిమాండ్ ఊపందుకుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ కార్యాలయంలో సంబంధిత నాయకులు అత్యవసర సమావేన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి దాడికి పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న జగన్నాథ్ ప్రధాన్ హాజరయ్యారు. ఆరోపణలకు సంబంధించి పార్టీ రాష్ట్ర కార్యవర్గం ప్రముఖులు ఆయనతో ముఖాముఖి చర్చించారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. పార్టీ అంతర్గత వ్యవహారాల వర్గం చర్చించింది. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్నాథ్ ప్రధాన్ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు.

పోలీసుల మోహరింపు..

బీజేపీ అంతర్గత సమావేశం ముగిసింది. ప్రభుత్వ నిర్ణయం అతిత్వరలో బహిరంగం కానుంది. ఈ పరిస్థితుల్లో ప్రముఖ కేంద్రాల్లో గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఆవరణలో ఒక ప్లాటూను, స్థానిక ఖారవేళ నగరు ఠాణా రక్షణ కోసం ప్రత్యేకంగా రెండు ప్లాటూన్ల పోలీసులను ముందస్తుగా మోహరించారు. ఏక్షణంలోనైన అధికారిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా పోలీసులు ఎక్కడికక్కడ మోహరించారు.

• క్రిస్టియన్ మంచ్ ఆందోళన


వర్షంలోనూ ర్యాలీగా వస్తున్న మహిళలు


గొడుగులు వేసుకుని ర్యాలీలో పాల్గొన్న పురుషులు

మల్కన్‌గిరి: జిల్లా క్రిస్టియన్ మంచ్ తరపున బుధవారం మల్కన్‌గిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. గత నెల 21 వ తేదీన మల్కన్‌గిరి సమితి కటామాటేరు గ్రామంలో కొందరు దుండగులు 30 మందిని తీవ్రంగా గాయపరిచిన విషయం విదితమే. దీనికి నిరసనగా క్రిస్టియన్ సంఘం వారు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు వినతిపత్రం ఇవ్వాలని వచ్చారు. కలెక్టర్ సకాలంలో రాలేదని ఆందోళనకారులును గేటు వద్దనే పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఆందోళనకారులుకు మధ్య ఉద్రిక్తత నెలకొంది.



కలెక్టరేట్ గేటు వద్ద ఆందోళనకారులు

రాణిగుడఫారంలో దొంగతనం

రాయగడ: స్థానిక రాణిగుడఫారం మూడోలైన్‌లో నివసిస్తున్న మహేష్ కుమార్ ఇంట్లో మంగళవారం చోరీ జరిగింది. ఇంటిలో ఉన్న 7 తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. చోరీకి సంబంధించి బాధితుడు మహేష్ సదరు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సమీపంలో గల సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనం చేసింది యాచకురాలని గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం మహేష్ అతని కుటుంబీకులు ఫంక్షన్‌కు సంబంధించి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 11.30 గంటల సమయంలో అతని భార్య బీరువాలో గల బంగారు ఆభరణాలు తీసి మంచం మీద పెట్టింది. అనంతరం లోపలకు వెళ్లి తిరిగివచ్చే సరికి బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమీపంలో గల సీసీ ఫుటేజ్‌ను పరిశీలించగా యాచకురాలు ఇంటిలో చొరబడి బంగారు ఆభరణాలను దొంగలించి వెళ్లినట్లు నిక్షిప్తమైంది.

వాణిజ్య అధికారికి వీడ్కోలు

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ మండలంలో వాణిజ్య అధికారిగా దీర్ఘకాలం సేవలు అందించిన గిరీష్ చంద్ర నాయక్‌కు దిగువ స్థాయి సిబ్బంది సాదరంగా వీడ్కోలు పలికారు. 2021 నుంచి మండలంలో ఆయన వాణిజ్య అధికారిగా సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించి టికెటు తనిఖీ ఆదాయం గణనీయంగా పెంపొందించడంలో దోహదపడ్డారని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెసు వర్గం అభినందించి వీడ్కోలు పలికింది.

జయపురం కేంద్ర విద్యాలయం సందర్శన


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గల సమగ్ర గిరినాభివృద్ధి ఏజెన్సీ(ఐటీడీఏ) భవనంలో నిర్వహిస్తున్న జయపురం కేంద్ర విద్యాలయ తాత్కాలిక క్యాంపస్‌ను కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ మగళవారం సాయంత్రం సందర్శించారు. జయపురంలో కొత్తగా ప్రారంభిస్తున్న కేంద్ర విద్యాలయంలో ఈ నెల 7వ తేదీ నుంచి పాఠ్య బోధనలు జరుగనున్నందున విద్యాలయంలో తరగతి గదులను, క్యాంపస్ పరిసరాలను తదితర సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 6వ తేదీన కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ జయపురం వస్తున్నట్లు తెలుస్తుంది. అందువల్ల విద్యాలయ భవనాలకు రంగులు వేయాలని అలాగనే విద్యాలయ సైన్‌బోర్డు మార్చాలని సూచించారు. అనంతరం గ్లోకల్ హాస్పిటల్ ప్రాంతంలో కేంద్ర విద్యాలయం భవనాలు నిర్మించేందుకు గుర్తించబడిన 8 ఎకరాల స్థలాన్ని కలక్టర్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శంకుస్థాపన చేసే కార్యక్రమం ఉన్ననట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్‌తో పాటు జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శౌశ్యా రెడ్డి, జయపురం మున్సిపాలిటీ అదనపు కార్యనిర్వాహక అధికారి పూజా రౌత్, జయపురం అదనపు తహసీల్దార్ చిత్తరంజన్ పట్నాయక్, ఐటీడీఏ ఇంజనీర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న చెస్‌పోటీలు

సాలూరు: ఆంధ్రా చెస్ అసోసియేషన్ తరఫున సాలూరు పట్టణంలోని చినబజారు వద్ద గల ఆర్యవైశ్యధర్మశాలలో ఈ నెల 6న చెస్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కో ఆర్డినేటర్ తిరుమలేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.16 సంవత్సరాల లోపు బాల బాలికలకు నిర్వహించే ఈ పోటీలను బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8008008272, 9182337499 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళలకు ఉచిత శిక్షణ

విజయనగరం అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి కలిగించే పలు కోర్సులకు ఉచిత శిక్షణా తరగతులను స్థానిక మహిళా ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ వసతిగృహంలో నిర్వహిస్తామని సంస్థ డైరెక్టర్ డి.భాస్కరరావు బుధవారం తెలిపారు. పురుషుల కోసం 30 రోజుల సెల్ ఫోన్ రిపేరింగ్ అండ్ సర్వీసు కోర్సు, లైట్ మోటార్ వెహికల్ ఓనర్ డ్రైవర్ కోర్సులపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వసతి భోజన సౌకర్యాలను ఉచితంగా కల్పించే ఈ కోర్సులకు తెల్లకార్డుదారులు, 45 ఏళ్లలోపున్న గ్రామీణ ప్రాంత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను కార్యాలయానికి పంపాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9959521662, 99857 87820 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

గంజాయి కేసులో మూడో నిందితుడి అరెస్టు

విజయనగరం క్రైమ్: 2023లో విజయనగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన గంజాయి కేసులో మూడో నిందితుడిని శనివారం అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆ ఏడాదిలో అక్రమంగా 18 కేజీల గంజాయి సరఫరా చేసిన కొరాపుట్‌కు చెందిన గిరి అలియాస్ పాండేను అరెస్టు చేసి విజయనగరం మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు.

టేకు దుంగల వ్యాన్ పట్టివేత

భామిని: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అక్రమంగా తరలివెళ్తున్న టేకు దుంగల వ్యాన్‌ను తహసీల్దార్ శివన్నారాయణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. అనంతరం బత్తిలి పోలీస్‌స్టేషన్‌కు టేకు దుంగల వ్యాన్‌ను తరలించారు. మండలంలోని మనుమకొండ సమీపంలో సుమారు 26 టేకు చెట్లు అనుమతులు లేకుండా నరికివేసి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. కొన్నాళ్లుగా మనుమకొండ ప్రాంతం నుంచి టేకుకలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారుల స్పందనపై పలువురు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మణి ప్రభాకర్, వీఆర్ఓ గిరిబాబులు ఉన్నారు.

హోటల్స్‌పై విజిలెన్స్ దాడులు



అక్రమంగా వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు.

రాజాం సిటీ: పట్టణంలోని పలు హోటల్స్‌లో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. గృహావసరాలకు వినియోగించే గ్యాస్‌ను హోటల్స్‌లో అక్రమంగా వినియోగిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేపట్టామని విజిలెన్స్ ఎస్సై రామారావు తెలిపారు. మూడు హోటల్స్‌లో రూ.24,432లు విలువ చేసే 10 సిలిండర్లు సీజ్ చేయడంతో పాటు 6ఎ కేసులు నమోదుచేశామన్నారు. ఈ దాడుల్లో హెచ్‌సీ కామేశ్వరరావు, పురుషోత్తం, కన్నబాబు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కాస్త పెరిగిన తోటపల్లి నీటి ప్రవాహం



గరుగుబిల్లి: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టుకు నీటి ప్రవాహం కాస్త పెరిగింది. నాగావళి నదిలో తోటపల్లి ప్రాజెక్టు వద్ద బుధవారం సాయంత్రం నాటికి 104.3 మీటర్ల మేర నీరు నిల్వ ఉంది. నదిలోకి 2,584 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఒక గేటును ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలకు 1.957 టీఎంసీలు ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

గోరపాడు జీడితోటల్లో ఏనుగులు

సీతంపేట: చిన్నబగ్గ కొండశిఖరాన ఉన్న ఏనుగుల గుంపు బుధవారం గోరపాడుకు చేరుకుంది. జీడి, మామిడి తోటల్లో సంచరిస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. కొండపోడు, ఖరీఫ్ పనులకు వెళ్లేందుకు గిరిజనులు భయపడుతున్నారు. ఏనుగుల గమనాన్ని ట్రాకర్లు పరిశీలిస్తూ గిరిజనులను అప్రమత్తం చేస్తున్నారు.

గిరిజన బిడ్డల చదువు కష్టాలు!

- అధ్వానంగా పాఠశాలలు
- వసతిలేని బడి
- కనీస సదుపాయాలు కరువు

ఐదు తరగతులకు ఒక్కటే భవనం



డి.శిర్లాం పంచాయతీ లోవరఖండి గ్రామ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 47 మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. వీరికి నలుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. అన్ని తరగతులకు ఒక్కభవనమే కావడంతో, 1వ తరగతి, 3వ తరగతి విద్యార్థులకు ఇదిగో ఇలా వంటషెడ్‌లో ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఉదయం వేళ వంటషెడ్‌లో వంటకాలు జరపగా, వంటలు పూర్తయ్యాక వంటషెడ్‌లో విద్యార్థులకు బోధన సాగిస్తున్నారు. వంటషెడ్‌ను నాడు, నేడు నిధులతో శ్లాబ్‌వరకు పనులు జరిపించగా మిగిలిన పనులు నిధులు మంజూరుకాక మధ్యలోనే నిలిచిపోయాయి.

రాళ్లు, రప్పలు దాటుకుంటూ పాఠశాలకు వస్తున్న చిలకమెండంగి చిన్నారులు





చిలకమెండంగిలో వాతావరణం తెరిపిస్తే తరగతులు నిర్వహించే చోటు ఇదే..

మక్కువ:

గిరిజన బిడ్డలకు చదువు కష్టాలు వెంటాడుతున్నాయి. పక్కాభవనాలు లేకపోవడంతో చెట్లకింద, వంటషెడ్‌లు, సామాజిక భవనాలు, రేకులషెడ్‌లు, పూరిపాకల్లో అక్షరాలు నేర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని చెప్పకతప్పదు. తమ పిల్లలు నిరక్షరాస్యులుగా మిగిలిపోకూడదని, కష్టపడైనా పిల్లలను మంచి చదువులు చదివిద్దామని గిరిజన చిన్నారుల తల్లిదండ్రులు ఆశపడుతున్నా.. పిల్లలు చదువులు సాగించేందుకు కనీస సదుపాయాలు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. పాఠశాలల విలీనంతో కష్టాలు మరింత ఎక్కువయ్యాయని వాపోతున్నారు. గిరిశిఖర గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, ఆర్థిక స్థితిగతులు అంతంతమాత్రం కావడంతో, సుదూర ప్రాంతాల్లోని పాఠశాలలకు ఆ చిన్నారులను చదువులకు పంపించలేకపోతున్నామని చెబుతున్నారు. గిరిజన, స్త్రీ శిశుసంక్షేమ శాఖమంత్రిగా కొనసాగుతున్న గుమ్మడి సంధ్యారాణి ఇదే నియోజకవర్గానికి చెందిన వ్యక్తి అయినా గిరిజనుల సంక్షేమం, పిల్లల చదువులను కనీసం పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

సామాజిక భవనంలో చదువులు

చిత్రంలో విద్యాభ్యాసన సాగిస్తున్నది గొడేవలస గ్రామంలోని ఫౌండేషన్ స్కూల్ పిల్లలు. వీరి పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడంతో ఇదిగో ఇలా గ్రామంలోని ఐటీడీఏ నిర్మించిన సామాజిక భవనంలో చదువులు సాగిస్తున్నారు. వర్షం కురిస్తే, సామాజిక భవనం కూడా కారిపోతుండంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి గిరిజన విద్యార్థులు చదువునేందుకు వీలుగా కనీస మౌలికవసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుడు కోరుతున్నారు.



చినుకుపడితే సాగని చదువులు

చిత్రంలో పిల్లలు చదువుతున్న రేకుల షెడ్ మక్కువ మండలంలోని గిరిశిఖర గ్రామమైన చిలకమెండంగిలోని సామాజిక భవనం. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పక్కాభవనం లేదు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద పక్కాభవనానికి నిధులు మంజూరు చేసినా నిర్మాణం ప్రారంభం కాలేదు. ప్రస్తుత పాలకులు పట్టించుకోవడం లేదు. ఫలితం.. వాతావరణం తెరిపిస్తే, ఆరుబయట చెట్ల కింద, వర్షం, ఎండ తీవ్రంగా ఉంటే గ్రామస్తులు చందాలతో నిర్మించుకున్న సామాజిక భవనం(రేకులషెడ్)లో ఒకటి నుంచి ఐదు



తరగతులు చదువుతున్న 22 మంది విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు చేరుకోవాలంటే రాళ్లు, రప్పలతో కూడిన ఎత్తైన రహదారే మార్గం.

శతశాతం జీఎస్టీ వసూలు కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్:

జిల్లాలో వాణిజ్య, వాణిజ్యేతర సంస్థల నుంచి శతశాతం జీఎస్టీ వసూలు కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదాయం తెచ్చిపెట్టే శాఖలైన గనులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఎల్డీఎం, డీపీఓ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏలు, మున్సిపాలిటీలు, పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ శాఖలకు చెందిన అధికారులు తమ వద్ద ఉన్న జాబితాలను వాణిజ్య పన్నుల శాఖకు అందజేయాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జీఎస్టీ వసూళ్లపై సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆస్తి పన్నులో కూడా జీఎస్టీ వసూలయ్యేలా చొరవ తీసుకోవాలని,ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వృత్తి పన్ను వసూలు కావాలన్నారు. జీఎస్టీ వసూళ్లపై డీడీఓలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. టీడీఎస్ చెల్లింపులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో రిజిస్టర్ కాబడిన వాణిజ్య వ్యాపారాలు, నూతన భవనాలు, ఇతర సముదాయాల మేరకు పన్నులు వసూలు చేసుకునేందుకు వీలుగా జాబితాలను వాణిజ్య పన్నుల శాఖకు అందజేయాలని తెలిపారు. మండల, గ్రామ స్థాయిలో ఆస్తి, ఇతర పన్నులు సక్రమంగా వసూలు చేసేలా గ్రామ సచివాలయ సిబ్బంది, ఎంపీడీఓలు అందజేయాలని స్పష్టం చేశారు. జీఎస్టీ వసూళ్లు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అందుకు గల కారణాలను తెలుసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జున మాట్లాడుతూ జిల్లాలో జీఎస్టీ వసూళ్లు తక్కువగా ఉన్నాయని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. తమ శాఖల ద్వారా చేపడుతున్న పనుల వివరాలను తమకు అందజేయడం ద్వారా జీఎస్టీ వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారుల సమన్వయంతో వసూలు చేసేందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహనరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మచంద్రారెడ్డి, డీఎంహెచ్ఓ డా.ఎస్.భాస్కరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎల్డీఎం ఎస్.విజయ్‌స్వరూప్, డీపీఓ టి.కొండలరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, మున్సిపల్ కమిషనర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఓ.ప్రభాకరరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక శ్రద్ధ

పీఎం సూర్యఘర్ యూనిట్ల ఏర్పాటు, పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతంగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. వారంలోగా ప్రగతి కనబరచకపోతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో హెచ్చరించారు. లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు.

రక్తహీనత నివారణలో పురోగతి ఉండాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు

పార్వతీపురం రూరల్: రక్తహీనత నివారణే ధ్యేయంగా పార్వతీపురం మన్యం జిల్లాలో చేపడుతున్న ఎనీమియా ఏక్షన్ కమిటీల ద్వారా పురోగతి సాధించే దిశగా కార్యాచరణ చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మండలంలోని తాళ్లబురిడి, పెదబొండపల్లిలో నిర్వహించిన ఎనీమియా ఏక్షన్ కమిటీలను(ఏఏసీ) బుధవారం ఆయన పర్యవేక్షించారు. రక్తహీనత నివారణకు ఏ విధమైన కార్యాచరణ చేపడుతున్నారు? చేసిన కమిటీ తీర్మానం, రక్తహీనతగా గుర్తించిన గర్భిణి, బాలింతల వివరాలు అయన రికార్డులో పరిశీలించారు. గతనెలలో రక్తహీనత నివేదికల్లో ప్రస్తుతం పురోగతిపై ఆరా తీశారు. అనంతరం గర్భిణి, బాలింతలకు తగు సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. పౌష్టికాహారం ఆవశ్యకతపై వివరించి అంగన్వాడీ కేంద్రం నుంచి అందజేస్తున్న టీహెచ్ఆర్ సద్వినియోగం చేసుకోవాలని, కిల్కారీ మొబైల్ సందేశాన్ని పాటించాలని సూచించారు. ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలన్నారు. గర్భిణి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం డీఎంహెచ్ఓ గర్భిణులకు పౌష్టికాహారం అందజేసి సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు, డీపీఎంఓ డా.పీఎల్ రఘుకుమార్, వైద్యాధికారులు డా.కౌశిక్, ధరణి తదితరులు పాల్గొన్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్. భాస్కరరావు

రాజధానికి జిందాల్ సెగ

శృంగవరపుకోట: జిందాల్ పరిశ్రమ తమతో ఆడుతున్న ఆటలతో అలిసిపోయిన నిర్వాసితులు తమ నిరసన సెగ రాజధానిని తాకేలా చేశారు. ఈ మేరకు బుధవారం పలువురు జిందాల్ నిర్వాసితులు రాజధాని అమరావతిలో షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్‌ను కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కానందున తమ భూములు తమకివ్వాలని కోరారు. ఎంఎస్ఎంఈ పార్కులకు కావాలంటే కొత్తగా భూసేకరణ చేయాలని, తాటిపూడి నీరు తాగునీటి అవసరాలకు కేటాయించాలని, శాంతియుతంగా పోరాడుతున్న తమపై పోలీసుల దమనకాండను నిరోధించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. అలాగే ప్రజాదర్బార్‌లోను, జనసేన కేంద్ర కార్యాలయంలోను వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాసితులు ఎం.సన్యాసిరావు, జి.ఈశ్వరరావు, ఎం.సన్యాసమ్మ, డి.సింహాచలం, బి.లక్ష్మణరావు, పి.రేవతి, కె.పైడితల్లి, బి.విజయ్‌బాబు, కేత వీరన్న, కిల్లో అర్జున, కె.సన్యాసిరావు, టి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల సంచారంతో బెంబేలు

- మడ్డువలస బ్రిడ్జి ఆవరణలో తిష్ట



మడ్డువలసలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

వంగర: మండలంలోని వివిధ గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గడిచిన ఐదు రోజులుగా ఒకే ప్రదేశంలో తిష్టవేయడంతో అటు ప్రయాణికులు, ఇటు రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం కూడా మడ్డువలస వంతెన ఆవరణలోని పంటపొలాల్లో తొమ్మిది ఏనుగుల గుంపు సంచరిస్తోంది. పంట పొలాల్లో చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో మడ్డువలస, సంగాం, మగ్గూరు గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వంగర-రాజాం రోడ్డును ఆనుకుని ఏనుగుల గుంపు తిష్ట వేయడంతో పలుమార్లు పోలీస్, అటవీశాఖ అధికారులు రోడ్డును బ్లాక్ చేస్తూ వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. రైతులు, వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని, ఎలిఫెంట్ ట్రాకర్స్, రోడ్డుపై ఉన్న వివిధ శాఖల అధికారుల పరిశీలన అనంతరం ఏనుగులు సంచరించే ప్రదేశాలు దాటుకుని వెళ్లాలని సూచిస్తున్నారు.



అటవీశాఖ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

అప్రమత్తంగా ఉండాలి

ఏనుగులు సంచరించే ప్రాంతంలో రైతులు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హరి రమణారావు తెలిపారు. మడ్డువలస వద్ద ఏనుగుల గుంపును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం అటవీశాఖ అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో అటవీ, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సర్వజన ఆస్పత్రిలో ఎస్టీ సెల్ ఏర్పాటు

- ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర రావు

విజయనగరం ఫోర్ట్:

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషాఆస్పత్రుల్లో షెడ్యూల తెగల ప్రజల సహాయం కోసం ప్రత్యేకంగా ఎస్టీ సెల్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర రావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓపీ విభాగాలను, జనరల్ వార్డు, సర్జరీ విభాగం, ఐసీయూ, రేడియాలజీ, సిటిస్కాన్ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి వైద్యసేవలు, భోజన నాణ్యత గురించి తెలుసుకున్నారు. అనంతరం ఘోషాఆస్పత్రిని సందర్శించి ప్రసూతి విభాగం, పిల్లల వార్డు, ఐసీయూ, చిన్నారులకు, పోషకాహారం అందించే వార్డులను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఘోషా ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకుని అవసరమైన సేవల ఏర్పాటు గురించి ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఆస్పత్రిని సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ.రమణి తదితరులు పాల్గొన్నారు.



సర్వజన ఆస్పత్రిలో ల్యాబొరేటరీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర రావు

చిల్లంగి నెపంతో మహిళ హత్య?

బొబ్బిలి: పట్టణంలోని బండారు వీధిలో నివాసముంటున్న కరగాని పద్మ(45) అనే మహిళ హత్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం తాను నివసిస్తున్న ఇంట్లోంచి తీవ్ర గాయాలతో అరుస్తూ వచ్చి గుమ్మం వద్ద పడిపోవడంతో స్థానికులు, కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో పోస్ట్‌మార్టం రూమ్‌కు తరలించారు. పక్క పక్క ఇళ్లలో ఉంటున్న కుటుంబసభ్యులే హతమార్చి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు. కరగాని పద్మ పలువురి ఇళ్లలో పనులు చేసుకుంటోంది. భర్త పైడిరాజు మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. పెళ్లిళ్లై ఆటోలు నడుపుకుంటూ వేరే చోట ఉంటున్నారు. పద్మ చిల్లంగి పెట్టడం వల్ల తన భార్య చనిపోయిందని, కుమారుడు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చిందని, దీనంతటికీ పద్మే కారణమన్న అనుమానంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసినట్లు పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

డీఎస్పీ పరిశీలన

ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ జి.భవ్యారెడ్డి మృతురాలు పద్మ నివసిస్తున్న ఇంటిని పరిసరాలను పరిశీలించారు. ఎస్సై రమేష్‌కుమార్‌తో కలిసి కుటుంబసభ్యులు, స్థానికులను విచారణ చేశారు. అనంతరం క్లూస్ టీమ్ వచ్చి ఆధారాలు సేకరించారు.

కత్తిపీటపై పడిపోయిందని..

డీఎస్పీ, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులను విచారణ చేయగా పద్మ కత్తిపీటమీద పడిపోయిందని, గాయాల పాలై చనిపోయిందని కుటుంబసభ్యులు చెప్పడంతో పోలీసులకు అనుమానం వచ్చి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

విజయనగరం క్రైమ్: విజయనగరం రూరల్ పోలీసులు జిల్లా కేంద్రంలోని హుకుంపేటకు చెందిన గంజాయి నిందితుడ్ని బుధవారం అదుపులోకి తీసుకున్నారు. 2023లో గంజాయి అక్రమ రవాణా కేసులో నాటి పాత నిందితు డ్ని రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై అశోక్, సీఐ లక్ష్మణరావు ఆదేశాలతో బుధవారం రాత్రి పోలీస్ సిబ్బంది పట్టుకున్నారు.

విద్యుత్ తీగలు తగిలి మూడు మేకల మృతి



మృతిచెందిన మేకల దగ్గర విలపిస్తున్న యజమానులు

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి మూడుమేకలు మృతిచెందాయి. బుధవారం జరిగిన ఈ సంఘటనపై మేకల యజమానులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బడ్నాన సోములు, పెరుమాల అప్పారావు, తోకల చిన్నమ్మతల్లి వారి మేకలను పొలాల్లోకి మేతకు తోలారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడం వల్ల అదే గ్రామానికి చెందిన సిరిపురం రమణ పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తెగి కిందపడ్డాయి. ఆ పొలంలోకి మేతకు వెళ్లిన మేకలు కిందపడి ఉన్న తీగలకు తగిలి షాక్‌కు గురై గిలగిల కొట్టుకుంటూ మృతిచెందాయి. మేకల యజమానులు పరిగెత్తి వెళ్లి చూశారు. విద్యుత్ తీగల కింద పడి మేకలు ఉండడంతో ముట్టుకోకుండా వెనక్కు జంకారు. దీంతో పెనుప్రమాదమే తప్పింది. మృతి చెందిన మేకలను చూసి యజమానులు భోరున విలపించారు.

గుంతలో పడి 30 గొర్రెలు..



గుంతలో పడి మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి అనిల్‌కుమార్ సర్పంచ్ శర్మ బాధితులు

వేపాడ: మండలంలో రామస్వామిపేట గ్రామంలో ఇద్దరు వ్యక్తులకు చెందిన 30 గొర్రెలు ప్రమాదవశాత్తు గుంతలో జారిపడి మృతిచెందడంతో వాటి యజమానులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇందుకు సంబంధించి స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం గ్రామానికి చెందిన పత్రి బాలకృష్ణ, రామారావులకు సంబంధించిన గొర్రెల మందను మేత కోసం తోలారు. గ్రామసమీపంలో ఊరమెట్ట వద్ద వాటిని మేపి కిందికి దిగుతుండగా అక్కడే ఉన్న పెద్ద గుంతలో 30 గొర్రెలు జారిపడి చనిపోయాయి. ఈ సమాచారం గ్రామంలో తెలియగానే సర్పంచ్ వడ్లమాని శర్మ, పశువైద్యాధికారి అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతి చెందిన గొర్రెలను పరిశీలించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. సుమారు రూ.నాలుగు లక్షల నష్టం వాటిల్లిందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

విద్యుత్ స్తంభం పడి మూడు మూగజీవాలు..



విద్యుత్ స్తంభం కూలి చనిపోయిన గేదెపెయ్యి, విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిన గేదెలు

శృంగవరపుకోట: ఎస్.కోట పరిధిలోని కాపు వారి కళ్లాల వద్ద కరెంట్ స్తంభం కూలి ఒక చూడి గేదె, పాడిగేదె, గేదెపెయ్యి ప్రాణాలు వదిలాయి. ముందుగా స్తంభం కూలి పెయ్యిపై పడి చనిపోగా, పక్కనే ఉన్న గేదెలపై విద్యుత్ తీగలు పడడంతో విద్యుత్‌ఘాతానికి గురై మృతి చెందాయి. దీంతో బాధితుడు వేమలి వెంకటరమణ, కుటుంబసభ్యులు వాటి వద్ద గుండెలు బాదుకుని రోదించారు. రూ.3లక్షలు విలువ చేసే పశువులు చనిపోయాయని వాపోయారు. కాగా ఈ ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు నోరు మెదపక పోవడం శోచనీయం.